పాడి - ఝుంప

తొల్లి కలవే యివియు - తొల్లి తాను గలడే
కల్లయును గాదు యిది - కడు నిజము గాదు

కను దెరచినంతనే - కలుగు వీ జగము
కను మూసినంతనే - కడు శూన్యమౌను
కనురెప్ప మరుగుననె - కలిమియు లేమియు
తన మనో భావనల - దగిలి దోచీని

తలచినంతనె యెంత - దవ్వైన గాన్పించు
తలపు మరచిన మదికి - దట్టమౌ తమము
పొలసి మతి మరుగుననె - పుట్టుటలు పోవుటలు
పలుచంచల వికార - భావమీ గుణము

ముందు తాగలిగితే - మూడు లోకములు గల
వెందు తా లేకుంటె - యేమియు లేదు
అంది శ్రీ వేంకటేశు - నాత్మలో ననె వీడె
కందువల నీతని సం - కల్ప మీ పనులు

నర పరంగా, నారాయణ పరంగానూ శబ్దంలోని అర్ధశ్లేషా భేదాలచే ఏర్పడిన మహా సూక్త సంకీర్తనమిది. నర పరంగా అర్ధం ఇది. ముందు జీవుడున్నాడా ? జీవుడున్నప్పుడు ఉన్న ఈ వస్తు విషయ వ్యామోహాదులు జీవుడు లేనప్పుడు ఉన్నవా ? ఇది నిజమా, అసత్యమా, అని ప్రశ్న. ఇది అసత్యము కాదు. (పంచేంద్రియ జ్ఞానం చేత తెలియబడుతున్నవన్నీ కేవలం మిధ్య అని ఎలాగ అనగలం ?) ఇది నిజం కూడా కాదు. (తను లేనప్పుడు ఏమి ఉందో ఎలా తెలియటం ? తను లేకపోతే ఈ సృష్టి అసత్యమన్న మాట).

జీవుడు ఉదయించగానే ఈ విశ్వంఅంతా (అతడికి సంబంధించినంతవరకూ ఉదయిస్తుంది. క్రమ పరిణామంగా తెలియబడుతుంది. జీవుడు మరణించగానే ఒక్కసారి అంతా శూన్యమే. జీవుని ఈ ఈక్షణాశక్తి యొక్క అస్తిత్వ రాహిత్యాల వల్లనే ఉన్నది - లేనిది - అన్న భావం కలిమి, లేమి అన్న ఊహా కలుగుతున్నాయి. ఈ భావం జీవుని భ్రమ, నిజమూ కాదు - అవాస్తవమూ కాదు. ఈ భ్రమ జీవుని మనసు ఆక్రమించి అల్లరి చేస్తూ ఉన్నది.

www.greenmangos.net

ఈ మనసు - మతి యెటువంటిది ? - భావ మాత్రం చేత ఎంత దూరమైనా ప రిగెట్టగలదు. ఎంత దూరమైనా చూడగలదు. భావం లేకపోతే మతికి అంతా అంధకార మే. అగమ్యగోచరమే. ఈ భ్రమించిన మనో బుద్ధుల చాటున జనన మరణాలు సంభవి స్తున్నవి. (నిజంగా చావు పుట్టుకలు అన్నవి లేవు. అది భ్రమ,శక్తి ద్రవ్యరాశిగానూ, ద్రవ్య రాశి శక్తి గానూ పరివర్తనం చెందుతున్నది అంతే అని శాస్త్రజ్ఞుల వాదం. $E=MC^2$ అన్న Albert Einstein సిద్ధాంతాన్ని తిరగవేస్తే $M = E/C^2$
అవుతుంది. E అంటే శక్తి సర్వస్వం. M అంటే ద్రవ్యరాశి సర్వం. C^2కాంతి వేగాన్ని కాంతి వేగంతో గుణిస్తే వచ్చే లబ్ధం వేగంగా గల కాంత్యుత్తర పదార్ధ శక్తి) జననమరణాలు సత్య మని నమ్మించే గుణం బుద్ధికి జ్ఞానేంద్రియాల ద్వారా కలుగుతున్న వికారమే కాని సత్యం కాదు.

అస్తిత్వానికి వస్తే ముందు తాను (జీవుడు) ఉంటే ముల్లోకాలూ ఉన్నవి. లేకపోతే ఏమి ఉన్నది ? ఏమీ లేదు జగత్సర్వం తానే అయినాడు శ్రీవేంకటేశ్వరుడు. ఆయనలోనే ఉన్నవాడు ఈ జీవుడు ఇరువురూ అన్యులుగా భాసించినప్పటికీ ఏకస్థులే. ఈ సృష్టి ఈ భ్రమలు అన్నీ ఆ తిరుమలేశుని ఇచ్ఛవల్ల కల్గుతున్నవని జీవుడు ఆ విషయం గ్రహించవల సినదనీ నరపరంగా అర్థం.

ఇక నారాయణపరంగా -

ముందు, అన్నిటికన్నా ముందు ఏముంది ? ఈ సృష్టి ఉందా ? అసలు తాను ఉన్నాడా నారాయణుడు ? ఇది నిజమా, కల్లా ? రెండూ కాదు, రెండూనూ ఋగ్వేదం లో నాసదాసీ సూక్తం ఉన్నది.

ఓం 'నాసదాసీన్నోసదా సీత్తదానీం నాసీద్రజో నోవ్యోమో పరోయత్
కిమావరీవః కుహకన్య శర్మన్నంభః కిమాసీద్గహనం గభీరం'
"నమృత్యురాసీదమృతం నతర్హి నరాత్ర్యా అహ్న ఆసీత్ ప్రకేతః"

సృష్టికి పూర్వం ఏమి ఉన్నది? ఏమీలేదు. ఎందువల్ల? ఈ ప్రశ్నోత్పత్తికి కూడా అవ కాశంలేక ఏమీలేని స్థితి, నిః స్థితి నిస్థితి ఉన్నది. ఈ నిస్థితినుండి నారాయణుడు - సం కల్పశక్తిగలిగిన బ్రహ్మసామర్థ్యం ఆవిర్భవించాడు. (ఈ బ్రహ్మసామర్థ్యం ఉపసంహృతమై తిరిగి నిస్స్థితి ఏర్పడుతుంది. సర్వమూ అందు లయిస్తుంది. ఆకాశంకూడా లయిస్తుం దని శంకరుల ఉవాచ. The State of Absolute Negation. Negation is the Origin of Creation
అని ఆధునిక భౌతిక శాస్త్రం చెప్తున్నది.)

నారాయణుడు సంకల్పించగా మనసు ఏర్పడి, అందునుండి పంచభూతములు ఏర్పడి జగ న్ని ర్మాణ సామగ్రి ఏర్పడింది.

"తస్మాద్వా ఏ తస్మాదాకాశ స్సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిఃఅగ్నే రాపః

www.greenmangos.net

అభ్యః పృథివీ పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోన్నమ్ అన్నాత్పురుషః” అని తైత్తిరీయోపనిష ద్వాక్యం. విరాట్పురుషుడైన నారాయణుని సంకల్పం. ఆయన కామన ప్రకారంగా చేతనా చేతన జగత్సృష్టి ఏర్పడ్డదని నారాయణోపనిషత్ చెపుతున్నది. “ ఓం అధపురుషోహవై నా రాయణో కామయతా ప్రజాస్సృజేయేతి నారా యణాత్ప్రాణో జాయతే మనస్సర్వేంద్రియాణి చ. ఖంవాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్యధారిణీ” ఇత్యాది ఉపనిషద్వాక్య ప్రమాణాలనను సరించి అసలు నారాయణుడు లేడు. నిస్థితి మాత్రమే ఉన్నది. ఈ జగమంతా నిస్స్థితి లోంచి వచ్చిన బ్రహ్మసామర్థ్యం అనే నారాయణుని సంకల్పం నుండి ఉద్భవించినది. మరి ఇదంతా ఏమిటి నిజమా-కల్లా అంటే ఇదంతా సాపేక్షంగా - నిజము. సాపేక్షంగా మిధ్య. గజంమిధ్య అంటే పలాయనం కూడా మిధ్య అన్న శ్రీశంకరుల ప్రతిపాదన ఇటువంటిదే సాపేక్ష సత్యాసత్యాల సంధ్యాసమయంలో సర్వచరాచర విశ్వమూ సంచరిస్తున్నదని శం కరులు సెలవిచ్చిన విశేషమిదే.

జగదుత్పత్తి క్రమవివరణ చిత్తిపన్నంలోని పురుషసూక్తంలో పేర్కొనబడ్డది. పురుష సూక్త పూర్వచర్చ నాసదాసీ సూక్తంలో కూర్చబడ్డది. పల్లవిలోనే ఈ రెండింటి సారాంశాన్నీ సూచనప్రాయంగా, వక్రోక్తిగా, రహస్యంగా చెప్పిన అచతుర్వదనుడైన బ్రహ్మ పదకవితా పితామహుడు.

ముందుగా ఆ నిస్థితిలో ఉదయించే నారాయణుడు కనుదెరచితే సంకల్పిస్తేనే ఈ సృష్టి ఏర్పడింది. ఆ నారయణుడు కన్ను మూస్తే వికల్పిస్తే సృష్టి అంతా ఆయనలో లీనమౌ తున్నది. ఘనద్రవవాయ్వాకాశ తదితర రూపమైన పదార్థ వస్తువులన్నీ తమ అస్తిత్వాన్ని కో ల్పోయి సృష్టికర్తృత్వ తత్వంలో ఐక్యమవుతున్నాయి. నారాయణుని కనురెప్పమరుగులోనే - ఆవిరాట్పురుషుని సంకల్పముల ఛాయలో సృష్టియొక్క అస్తిత్వనాస్తిత్వములు ప్రకటిత మౌతున్నవి. శ్రీమన్నారాయణుని మనోభావాలకు అనుగుణంగా ఆయన సంకల్పేచ్ఛా నిరీ చ్ఛలనుబట్టి జగత్పర్వం ఉన్నది లేదు అన్న విషయం జిజ్ఞాసువులైన బ్రహ్మజ్ఞానులకు తోస్తు న్నది.

ఆయన సంకల్పమాత్రంచేత అనంతమైన విశ్వాంతరాళాలలోకి కోట్ల కోట్ల కాంతి సంవత్సరాల సుదూర వైశాల్యాలకు ఈ సృష్టి విస్తరిస్తున్నది. సంకల్పరాహిత్యం చేత తన అస్తిత్వాన్నంతటినీ కోల్పోయి కాంతిహీనమైన అంధకారబంధుర నాస్తిత్వంలోనికి ఈ సృష్టి జారిపోయి లయిస్తున్నది.

ఆ అనంతస్వరూపుని యిష్టానిష్టాల మీదనే సృష్టిలోని సర్వప్రాణుల పుట్టుకలూ, మ రణములూ నిర్ణీతమై ఉన్నవి. ఈ విషయం ఎరుగని ప్రాణులు తమ జననజీవన శరణాల

www.greenmangos.net

కు మూలం వేరే ఏదో అని భ్రమిస్తున్నారు. అటువంటి భ్రమలు కల్లజేసే సృష్టికర్త మాయా మహాత్మ్యం ఇది.

నారాయణుడుంటేనే సృష్టి లేకపోతే ఏమీలేదు. నాసదాసీత్ అని ఋగ్వేదంలో రచించినట్లు. ఈ నారాయణుడెవరు - ఆయనే శ్రీవేంకటేశ్వరుని యాత్మ. ఆయనే శ్రీవేంకటేశ్వరుని సమగ్రస్వరూపం. ఆ నారాయణుడే శ్రీ వేంకటేశ్వరుడు. ఈ సంకీర్తన లో పైన పేర్కొనబడ్డ విషయమంతా ఈ సంకీర్తన. ఇది పాడే, చదివే వినే వారితో సైతం అంతా శ్రీమన్నారాయణుడే అతని సంకల్పమే ఈ సర్వమూ యఏవంవేద ఇత్యుపనిషత్ అని సంకీర్తనాచార్యులు నాసదాసీన్నారాయణోపనిషత్తులను సంకీర్తనగా సంతరించి, ఆంధ్రవేదసామగానం ఆలపించారు అన్నమాచార్యులు.

www.greenmangos.net